**కథ** -ఆర్.ఎస్. హైమవతి

# పరశురాముడు - విశ్వామిత్రుడు వియ్యమందారు

**హైదరాబాద్‌లో అదో పోష్ లొకాలిటీ! అక్కడంతా సంపన్న కుటుంబాలే వుంటాయని అందరికీ తెలిసిన విషయమే! ఆ కాలనీలో అందర్నీ ఆశ్చర్యానికి లోను చేసే బాంబు పేలుడు లాంటి వార్త నిముషాల్లో పాకిపోయింది.**

**"అయ్యో! ఏం కొంపలంటుకుంటాయో?" అని భయపడి చచ్చేవాళ్ళు కొందరైతే-**

''మా బాగా తిక్క కుదురుతుందిలే వెధవలకి'' అనుకుని ఆనందించేవాళ్ళు కొందరు.

''ఇదేదో పతాక సన్నివేశం వరకూ చూడాల్సిన విషయమే!'' అనుకునే వాళ్ళు కొందరు.

''మనం తియ్యబోయే కొత్త సినిమాకి ఈ ప్లాటు ఉపయోగపడుతుందేమో చూద్దాం!'' అనుకుని సస్పెన్స్‌తో ఎదురుచూస్తున్న నిర్మాతలు, డైరెక్టర్లూ కూడా లేకపోలేదు.

ఇంతకీ అంత బాంబులాంటి వార్త ఏమిటంటే ''విశ్వామిత్రుడు, పరశురాముడు వియ్యమందుతున్నారు'' అన్న విషయం.

వారిరువురి అనుబంధం కంసుడు-కృష్ణుడులా, రావణుడు-రాముడు లాంటిది. అయితే ఇక్కడ కంసుడు, రావణుడు చెడ్డవాళ్ళు (విలన్‌లు)గాను, రాముడు, కృష్ణుడు సత్పురుషులు (హీరోలు)గాను వర్ణింపబడ్డారు. మన కథలో పాత్రలు ఇద్దరూ మంచివారే! ఎవరికి వారు గొప్పవారే!

★ ★ ★

అది గోదావరి జిల్లాలోని ఓ మోస్తరు పట్టణం. అది సస్యశ్యామలమైన ప్రదేశం. ఆ ఊళ్ళో కో ఎడ్యుకేషన్ కాలేజీ, ఉమన్స్ కాలేజీ వున్నాయి. అదే మన హీరోలు పుట్టి, పెరిగి, చదివి ప్రయోజకులైన ఊరు.

నారాయణరావుగారు, శంకర్రావుగారు పేరు పొందిన లాయర్లు, స్నేహితులు. వారి స్నేహం ఎటువంటిదంటే- శివుడి హృదయంలో విష్ణువు, విష్ణు హృదయంలో శివుడు వుంటాడన్నది వీరిని చూసిన వారికి అక్షరాలా నిజమనిపిస్తుంది. అంతటి స్నేహం వారిది.

నారాయణరావుగారి సుపుత్రుడి పేరు విశ్వనాథ్. శంకర్రావుగారి సుపుత్రుడి పేరు పరశురామ్. ఇద్దరిదీ ఒకే వయసు, చదివేది ఒకే క్లాసు.

ఇద్దరిదీ పోటీ పడే స్వభావం. చంటిపిల్లప్పటి నించీ అది కొనసాగుతూనే వుంది. ఎదురు బదురు ఇళ్ళు కావడాన ఇద్దరిలో ఏ ఒక్కరు మొదట ఏడుపు ప్రారంభించినా రెండవవారు అంతకన్నా హెచ్చుస్థాయిలో ఏడుపు ప్రారంభించేవారు. అలాగే చదువు విషయంలోనూ పోటీయే! ఒకరికి ఫస్ట్‌రాంకు వస్తే మరొకరు మళ్ళీ పరీక్షలో తనకి ఫస్ట్ రేంకు వచ్చే వరకూ నిద్రపోకుండా చదివేవారు. అలాగే ఆటల్లోనూ పోటీపడి ప్రైజులు సంపాదించేవారు.

''ఇదీ మంచిదే! ఒకరినొకరు చూసి పాడయిపోకుండా బాగుపడుతున్నారులే!'' అని పెద్దలవాళ్ళు కూడా సమర్థించేవాళ్ళు. వీరిద్దరి మధ్య పోటీ తత్వం పెరిగి స్నేహం కొరవడింది. ''నీ గొప్పేమిటోయ్! నేనూ సాధించగలనులే!'' అన్నట్లుండేది వారి చూపుల భావాలు, మాటలుండేవి కావు.

వీరిద్దరి స్వభావాన్ని గ్రహించిన వాళ్ళ తెలుగు టీచరు ఓ సుముహూర్తాన ''ఒరేయ్! విశ్వనాధు! నువ్వు విశ్వనాధుడివి కావురా! విశ్వామిత్రుడివి. నువ్వు సాక్షాత్తూ పరశురాముడివే!'' అంది ఇద్దరివైపు చూసి, ఇద్దరూ కోపిష్టి వాళ్ళే అనే భావంతో.

క్లాసంతా నవ్వులతో నిండిపోయింది. ఆవిడ ఏ ముహూర్తాన ఆ నామకరణం చేసిందో గాని మొత్తానికి ఆ నోటా ఆ నోటా అందరూ..ఆ పేర్లనే స్థిరపరిచారు. వాళ్ళ తల్లిదండ్రులు కూడా విని ''నిజమే!'' అని ఆ పేర్లనే స్థిరం చేశారు. వాళ్ళిద్దరూ ఉడుక్కున్నా అంతటి గొప్పవాళ్ళమవుతామని లోలోన మురిసిపోయారు. అలాగే అవనూ అయ్యారు.

★ ★ ★

మహానగరంలో విశ్వం ఇండస్ట్రీస్, రామ్ ఇండస్ట్రీస్ పోటీపడి నడుస్తున్నాయి. లాభాలు గడించి పెడుతున్నాయి. ఒక సంస్థలో కొత్త మెషిన్ కొన్నారని తెలిస్తే రెండవ వారు ఆ మెషిన్ కొనాల్సిందే! ఒక సంస్థలో వర్కర్లకి జీతాలు పెంచారంటే మరో సంస్థలో పెరగాల్సిందే! ఒక సంస్థలో పనిచేసే సీనియర్ మేనేజర్లకి కారు ఇస్తే మరో సంస్థలో ఇచ్చి తీరాల్సిందే! ఇలా పోటీ స్వభావం సాగుతూ శుక్ల పక్ష చంద్రుడిలా దిన దిన ప్రవర్ధమాన మవుతోంది.

వీరి సెలక్షను అనుకున్నా, భగవదనుగ్రహం అనుకున్నా ఇద్దరికీ అందం, సద్భావం, మంచి గుణం గల భార్యలు దొరకడం అదృష్టమే కలిసి వచ్చిందనుకోవచ్చు. అంతవరకూ బాగానే వుంది.

విశ్వనాథ్ భార్య ఉమ, పరశురామ్ భార్య రమ ఒకేసారి నెల తప్పడం, ఒకే ఆస్పత్రిలో రెండు రోజుల తేడాలో ప్రసవించడం జరిగింది.

విశ్వనాథ్ భార్య ఉమ అమ్మాయిని, పరశురామ్ భార్య రమ అబ్బాయిని ప్రసవించడంతో ఆడవారిలో లేకపోయినా మగవారిలో పట్టుదలలు మరింత పెరిగాయి.

''నాకేమిటి? మహారాజులా కొడుకు పుట్టాడు. నా చుట్టూ అమ్మాయిలు తండ్రులందరూ చెప్పులరిగేలా కోటి రూపాయలు కట్నం ఇస్తామంటూ తిరుగుతారు'' అని పరశురామ్ అందరి దగ్గరా అంటే-

''నాకేమిటి? మహాలక్ష్మిలాంటి కూతురు పుట్టింది. ఈ కోట్ల పెళ్ళికొడుకులందరూ సూర్యుడి చుట్టూ తిరిగే భూమిలా ఆత్మప్రదక్షిణాలు చేస్తూ మరీ తిరుగుతారు. అప్పుడు నా చెప్పులరగవు గాని ఈ కోట్లకి ఆశపడే తండ్రి చెప్పులదండలు వేయించుకోవలిసొస్తుంది'' అన్నాడు విశ్వామిత్రుడు.

పరశురాముడు తన కొడుకు బాలసారె సందర్భంగా బంగళా ముందు, పైన డాబామీద

పెద్ద పెద్ద షామియానాలు వేయించి బాజాభజం త్రీలని ఏర్పాటు చేసి ఆఫీసులో ప్రతి ఒక్కరికీ భోజనాలు పెట్టి బట్టలు పెట్టి సంబరం జరుపు కున్నాడు. తన తండ్రి పేరు కొడుక్కి 'శంకర్' అని పెట్టుకున్నాడు.

మరో రెండు రోజుల తరువాత విశ్వామి త్రుడు తన కూతురు బాలసారె నిమిత్తం ఆఫీ సులో ప్రతి ఒక్కరికి ఫైవ్‌స్టార్ హోటల్లో విందు ఏర్పాటు చేసి అందరికీ ఒక నెల జీతం బోనస్‌గా ఇచ్చాడు. తన తల్లి పేరు 'వసుధ' అని కూతు రికి నామకరణం చేశాడు.

మంచి స్కూలుగా పేరుపొందిన స్కూల్లోనే ఇద్దర్నీ చేర్పించారు. వసుధ, శంకర్‌ల మధ్య కూడా పోటీ నెలకొని మంచి మార్కులు తెచ్చుకుంటు న్నారం గాని, తమ తండ్రులలాగా 'నువ్వెంత?' అంటే 'నువ్వెంత?' అన్నట్లు విరోధ భావాలు లేవు. సఖ్యంగానే పెరిగి పెద్దవుతున్నారు. వారి తల్లులు కూడా శాంత స్వభావులే కనుక పిల్లల్ని విడదీ యడానికి ప్రయత్నించలేదు.

★ ★ ★

''సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా గోల్డ్‌మెడలు సంపా దించావుగానీ ఫ్యూచర్ ప్లాన్లేమిటి?'' అడిగాడు కొడుకుని పరశురామ్.

''నాకు అందరిలా అమెరికా వెళ్ళాలని లేదు నాన్నా! మన కంపెనీలో కూడా ఐ.టి. ప్రవేశపె డితే ఇంకా ఎన్నో లాభాలు గడించవచ్చు. ఆ విధంగా మన కంపెనీని డెవలప్ చేయాలను కుంటున్నాను'' అన్నాడు శంకర్.

పుత్రోత్సాహం సుమతీశతకంలో చెప్పినట్లు పుత్రుడు పుట్టినప్పటి కన్నా వెయ్యి రెట్లు ఆనం దంతో కళ్ళు చెమరు స్తుంటే కొడుకుని కౌగలించుకుని వెన్నుతట్టాడు పరశురామ్.

''నాన్నా! మన కంపెనీలో కూడా సాఫ్ట్‌వేర్ ప్రవేశపెడదాం నాన్నా! అప్పుడే బాగా డెవలప్ అవుతుంది'' అంటూ చెప్పిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వసుధతో- ''భేష్! బాగా చెప్పావమ్మా! నువ్వు చూసుకుంటానంటే నాకేమీ అభ్యంతరం లేదు. కానీ నీకు పెళ్ళి చేసి పంపించడం మా బాధ్యత కదా! ఇది కుదిరే పనా? అని ఆలోచిస్తున్నాను'' అన్నాడు విశ్వామిత్రుడు.

చిరునవ్వుతో సిగ్గుపడుతూ తలదించుకున్న కూతురి భావం చూచాయగా గ్రహించినా ఆడ పిల్లలు పెళ్ళి పేరెత్తితే అలాగే సిగ్గుల మొగ్గలవుతారం



అనుకొని సరిపెట్టుకున్నాడు. రాత్రి భార్య ఉమ చల్లగా చేరవేసింది అసలు విషయం.

''మన వసుధ, వాళ్ళ శంకర్ ఒకరినొకరు ప్రాణంగా ప్రేమించుకున్నారు. మనం పెళ్ళి చెయ్యమన్నా వాళ్ళే చేసుకుని చక్కా వస్తారు. మన పెద్దరికం పరువు పోతుంది. వాళ్ళిద్దరూ అన్ని విధాలా ఒకరికొకరు తగినవాళ్ళే! మీ వియ్యంకుళ్ళు కూడా ఒకరికొకరు తీసిపోరు కదా! బహుశా మీలాంటి వాళ్ళని చూసేనేమో! వియ్యానికైనా కయ్యానికైనా సమఉజ్జీ వుండాలని పెద్దలన్నారు. అంచేత మన చేతుల మీదుగా పెళ్ళి జరిపించేస్తే సరిపోతుంది'' అంటూ హితబోధ చేసింది.

''సరే! పిల్లలకీ, మీకు ఇష్టమైతే నేనేం అడ్డుచెప్పను. కాని, వాడి చేతులు పట్టుకుని మాత్రం నేను అడగను. ఆ మాటలేవో మీరూ మీరూ మాట్లాడుకోండి. వాడికెంత కట్నం కావాలో చెప్తే మొహాన్ని కొడతాను'' అన్నాడు విశ్వనాథ్.

భార్య ద్వారా సమాచారం గ్రహించిన పరశురామ్ ''వాడేమిటి కట్నం ఇచ్చేది? వాడి మొహం! నేనేం నా కొడుకుని అమ్ముకోడానికి సిద్ధంగా లేను. కావాలంటే నేనే నా కొడుకు మీంచి దిగదుడిచి వాడి మొహాన్ని కొడతాను. వాడెంత ఇమ్మంటే అంత!'' అన్నాడు పరశురామ్.

★ ★ ★

పెళ్ళి అతి పెద్ద కళ్యాణమండపంలో బ్రహ్మాండంగా జరుగుతోంది. ఒక ద్వారం దగ్గర మగపెళ్ళివారి తరపు బంధువులు నిలబడి బంధువుల్ని స్నేహితుల్ని ఆహ్వానిస్తే వేరొకవైపు ఆడపెళ్ళి వారి తరఫువారు వారి బంధువుల్ని స్నేహితుల్ని ఆహ్వానిస్తున్నారు. ఒకరికొకరు వారిలో వారు పోటీలు పడి సన్మానాలు, సత్కారాలు చేసుకోవడమే కాక వచ్చిన వారికి కూడా పోటీపడి సత్కారాలు జరుపుతున్నారు. పెళ్ళవగానే విశ్వనాథ్ పది స్వీట్లతో నవకాయ పిండివంటలతో భోజనం పెట్టిస్తే రాత్రి రిసెప్షన్ మేము పెడతామంటూ పరశురామ్ వివిధ రాష్ట్రాల స్పెషల్ వంటకాలు, స్వీట్లు చేయించి అంతకు పదిరెట్లు ఖర్చు చేశాడు.

విశ్వనాథ్ వచ్చిన బంధువులకి స్నేహితులకి మైసూర్, గద్వాల్ చీరలు పంచి పెడితే- పరశురామ్ కంచిపట్టు, బెనారెస్ చీరలు పంచి పెట్టించాడు.

కట్నం తీసుకోనన్న వియ్యంకుడికి బుద్ధి చెప్పాలని విశ్వనాథ్ కన్యాదాన సమయంలో అందరి సమక్షంలోనూ తన అల్లుడికి తను కొత్తగా ప్రారంభించిన సాఫ్ట్‌వేర్ కంపెనీ రాసి ఇచ్చేశాడు.

వెంటనే తల ఎగరేసి అతడి వైపు నిరసనగా చూస్తూ తను కొడుకు చేత కొత్తగా ఓపెన్ చేయించిన ఐ.టి.కంపెనీని కోడలు పేర చదివించేశాడు పరశురామ్.

హాలులో మారు మోగిన చప్పట్లు అరగంట వరకూ ఆగలేదు.

''వాడికే పెద్ద డబ్బుందని గొప్ప! వీడి దగ్గర్నించీ తీసుకోడం మాకేం ఖర్మ!'' అని పరశురాముడంటే.

''మగపిల్లవాడి తండ్రి కాబట్టి వాడేదో గొప్పవాడైపోయినట్లు, నేనేదో పేదవాడినన్నట్లు వీడు విర్రవీగిపోతున్నాడు'' అని విశ్వనాథ్ అంటున్నాడు.

''వీరిద్దరి మధ్య ఇక ఈ జన్మలో సఖ్యత ఏర్పడదులా వుంది'' అనుకుంటూన్నారు అందరూ.

వీరి భార్యలు, పిల్లలు పట్టుపట్టడం వల్ల అప్పుడప్పుడు అంతా కలిసి భోం చేసినా-

''అమ్మాయ్ ఆ వెధవ మైసూర్‌పాకు తింటే నోరంతా వెగటుగా వుంటుంది. రవ్వలడ్డూ వెయ్యి'' అని విశ్వనాథ్ అంటే.

''చెల్లాయ్ ఉమా! ఆ దిక్కుమాలిన రవ్వలడ్డూ ఇసక తింటున్నట్లు వుంటుంది, మైసూర్‌పాక్ వెయ్యి'' అంటాడు విశ్వనాథ్ వైపు కొరకొరా చూస్తూ పరశురామ్.

★ ★ ★

ఏడాది గడిచింది. పండంటి మగపిల్లవాడిని కన్నది వసుధ. ఇక సంబరాలే సంబరాలు. రెండు ఇళ్ళల్లోనూ, వారి ఇండస్ట్రీల్లోనూ ఒకటే సంబరాలు. పిల్లవాడికి ఏ పేరు పెడతారోనని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వసుధ, శంకర్ గుసగుసలాడుకున్నారు.

పురోహితుడు ''బియ్యంలో పేరు రాయండి'' అన్నప్పుడు శంకర్ ''విశ్వరామ్'' అంటూ పేరు చెప్పాడు.

విశ్వామిత్రుడు, పరశురాముడు ఒకరి కళ్ళల్లోకి ఒకరు చూసుకున్నారు విజయగర్వంతో.

''మొత్తానికి మనవడు పుట్టి ఇద్దర్నీ కలిపాడు'' అన్నారంతా.

ఇప్పుడు ఇద్దరూ ఒకటిగా అందరితో అంటూ ఉంటారు. ''మాలో ఆ పోటీ స్వభావమే లేకపోతే ఈ విజయాలని సాధించేవారమే కాదు. ఒకరి విజయాన్ని ఒకరం మనసులో మెచ్చుకుంటూనే వున్నాము. కనుకనే ఆ పని చేయాలని పట్టుపట్టి సాధిస్తూ వచ్చాం. అయితే మనిషి పోటీతత్వాన్ని మంచికి వినియోగించాలి గాని చెడుకి వినియోగించకూడదు. ఇక మేం చూపిన బాటని మా పిల్లలు, తరువాత మనవడు కూడా విస్తరింపజేస్తారనే నమ్మకం మాకుంది'' అని.

☆

## హైదరాబాద్‌పై మోజు!

**ఇటీవల కాలంలో చాలామంది తారలు హైదరాబాదులోనే సెటిల్ అవుదామని అనుకుంటున్నట్టు టాలీవుడ్ సమాచారం. ఇందుకు తాజా ఉదాహరణ- కన్నడ భామ ప్రేమని చెప్పుకోవచ్చు. 'ధీ' తర్వాత ఆమెకి తెలుగులో అవకాశాలు కనిపిస్తుండడం, హైదరాబాదు వాతావరణం నచ్చడంతో ఫిలింనగర్‌కి దగ్గరగా ఓ ఫ్లాట్ కొనుక్కుందామని అన్వేషిస్తోందిట. అలాగే అలనాటి హీరోయిన్ సంగీత కూడా తన మకాంని హైదరాబాదుకి మార్చేసింది. కేరళ కుట్టి మీరాజాస్మిన్ కూడా హైదరాబాదులోనే సెటిల్ కావాలని అనుకుంటున్నట్టు సినీజనాలు చెబుతున్నారు.**

